ప్రజాభూమి



## విజయవాడ హజ్ ఎంబార్కేషన్ తొలగింపు తగదు

**-అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

విజయవాడ నుండి హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం మైనార్టీల కోసం ఏర్పాటుచేసిన ఎంబార్కేషన్ పాయింట్ ను తొలగించడం తగదని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయవాడలో హజ్ ఎంబార్కేషన్ తొలగించడం ఎన్డీయే ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆరోపించారు. విమానయాన శాఖ మంత్రి మన రాష్ట్రానికి చెందిన వారే అయినప్పటికీ ముస్లింలకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని విజయవాడ నుంచి హజ్ యాత్ర కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం సామాజిక వర్గంపై అన్ని వైపుల నుండి దాడులు, ఆంక్షలు ప్రతిబంధకాలపై ముస్లిం సమాజం ఉవ్వెత్తున ఉద్యమించే సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.

## ముదుగుబ్బ వారపు సంత వేలం



ముదిగుబ్బ, ప్రజాభూమి

ప్రతి శుక్రవారం ముదిగుబ్బలో నిర్వహించే కూరగాయలు, గొర్రెల సంతలో ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 వరకు సుంకం వసూలు చేసుకునేందుకు వేలమును స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అధికారులు నిర్వహించారు. వేలంపాటలో 12 మంది పాల్గొనగా గుత్తా ఉత్తమనాయుడు అనువ్యక్తి రూ. 11.26 లక్షలకు పాడి దక్కించుకున్నారు. ఇదే వారపుసంత ద్వారా 2024-25 కుగాను ముదిగుబ్బ మేజర్ పంచాయతీకి రూ. 7.26 లక్షలు ఆదాయం రాగా ప్రస్తుతం మరో నాలుగు లక్షల రూపాయలు అదనంగా పంచాయతీకి లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజులాదేవి, సర్పంచ్ లక్ష్మీదేవి, టిడిపి నాయకులు రమేష్ బాబు, ప్రభాకర, తుమ్మల మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

### వారపు సంతలో సౌకర్యాలు కల్పించండి...

ప్రతి ఏటా వారపుసంత ద్వారా ముదిగుబ్బ పంచాయతీకి లక్షలాది రూపాయలు ఆదాయము వస్తున్న అధికారులు వారపు సంతలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. వారపు సంతకు గ్రామీణ ప్రాంతాల నుండి వేలాదిగా ప్రజలతోపాటు పెద్ద ఎత్తున గొర్రెల మందులు వస్తుంటాయని కనుక శాశ్వత నీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులను సిపిఐ నాయకులు శ్రీనివాసులు కోరారు. దీంతో పారపు సంతలో త్వరితగతిన శాశ్వత నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దివాకర్ వివరించారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వన్నేరప్ప



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కేఎల్ వన్నెరప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా పివి రామచంద్రప్ప ఎన్నికయ్యారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారి కేసీ రఘునాథ్ రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్ష స్థానం కోసం వన్నెరప్ప, కే హెచ్ గోపాల్ నామినేషన్ దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి స్థానం కోసం పివి రామచంద్రప్ప, కృష్ణమూర్తి, మురళి పోటీ పడ్డారు. అయితే సీనియర్ న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులతో చర్చించి సమన్వయం చేసి ఏకగ్రీవంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో వన్నెరప్ప అధ్యక్షులుగా, పివి రామచంద్రప్ప ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఏపీపీ ఇందాద్, సీనియర్ న్యాయవాదులు నాగరాజు, ఏ.నాగరాజు రెడ్డి, రామిరెడ్డి, శివశంకర్ తదితరులు పూలమాలలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా వన్నెరప్ప మాట్లాడుతూ, అందరి సహకారంతో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఔషధ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**-నిబంధనల అతిక్రమణలపై కేసు నమోదు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో శుక్రవారం మెడికల్ ఏజెన్సీలు, మందుల షాపులపై విజిలెన్స్, డ్రగ్ ఇన్స్ పెక్టర్లు, ఈగల్ బృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాగశ్రీ, జనతా, బృంద మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహించి నిబంధనల అతిక్రమణలపై కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్ పెక్టర్ హనుమన్న, విజిలెన్స్ సీఐ సద్గురుడు లు మాట్లాడుతూ, ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్ టీం, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డ్రగ్గ్ కంట్రోల్ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో దాడులను నిర్వహించామన్నారు. ముఖ్యంగా మెడికల్ షాపుల్లో అక్రమ మత్తు పదార్థాలు ఉన్నాయా అనే దాని పైన సమగ్రంగా తనిఖీలను నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో వీటితోపాటు సరైన రికార్డులు ఉన్నాయా లేదా పరిశీలించామన్నారు. మత్తును కలిగించే మందులు అమ్మడం నేరం కాకపోయినా వైద్యుల పర్యవేక్షణలో ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం నేరమని తెలిపారు. శాంపుల్ డ్రగ్గ్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ ఆర్ ఎక్స్ డ్రగ్స్ ను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకూడదని వీటి వివరాలను ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి అందుబాటులో లేకపోవడంతో మత్తు టాబ్లెట్స్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ అమ్ముతున్నారన్నారు. యువత మత్తు టాబ్లెట్స్ తీసుకొని మత్తులో జోగుతున్నారని, మత్తులో యువత నేరాలవైపు అడుగులు వేసే అవకాశం ఉందని తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ మెడికల్ షాప్ నిర్వాహకులు అమ్మితే చట్టపరమైన చర్యలు చేపడుతామని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని డ్రగ్ ఇన్స్ పెక్టర్ హనుమన్న హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్‌అధికారి వాసు ప్రకాష్, వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్, ఈగల్ టీం ఫరీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర అభివృద్ధికై ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

### రాజకీయాలకు అతీతంగా రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజా భూమి బ్యూరో, అనంతపురం



ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధికై, "ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక" ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు నాయకులు కె.వి రమణ, గంటల నారాయణరెడ్డి మాట్లాడి, కరపత్రములు విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు బిజిఆర్ ఫంక్షన్ హాల్, కళ్యాణ్ దుర్గం రోడ్డు అనంతపురం నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించుచున్నాము. ఉమ్మడి అనంతపురం జిల్లా మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టులు, విభజన హామీలపై చర్చ జరుగుతుందన్నారు. ముఖ్యంగా దేశంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రాణప్రదమైన హంద్రీ-నీవా, హెచ్ ఎల్ సి ప్రాజెక్టులపై చర్చించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుంది. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ కార్యక్రమాలు ఎడారి జిల్లాలో అర్హులందరికీ అందించాలని కోరుతున్నాం. హంద్రీ-నీవా లైనింగ్ పనులు ఆపి, కాలువ వెడల్పు చేయాలని, హెచ్ ఎల్సీ కాలువను ఆధునికరించి మనకు హక్కుగా రావాల్సిన 32.5 టిఎంసిలు తీసుకొచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల పూడిక ద్వారా నష్టపోతున్న 130 టీఎంసీల నీటిని తెచ్చుకోవడానికి, సమాంతర కాలువ నిర్మాణం, గుండ్రేవుల, సిద్దేశ్వరం-అలుగు, రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి నికరజలాలుగా అనంతపురం జిల్లాకు మళ్లించే ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరుచున్నాము. కె.వి రమణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, ఏ శ్రీనివాసులు ఆర్‌ఎస్పి సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి, గంటల నారాయణరెడ్డి రైతు సంఘం నాయకులు, ఏపీఎస్ఎస్ నాయకులు, కుళ్లాయప్ప వెంకటేశు, పృధ్వి ఆర్ ఎస్ ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద మొరాయించిన మోటరు

**-పరిశీలించిన చైర్మన్, కమిషనర్-తక్షణ మరమ్మత్తులకు ఆదేశాలు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణానికి నీరు అందించే గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద మోటార్ మొరాయించింది. శుక్రవారం తెల్లవారుజామున మోటార్ చెడిపోవడంతో నీటి సరఫరా ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు అధికార బృందాన్ని వెంటబెట్టుకొని హుటాహుటిన గొల్లపల్లి రిజర్వాయర్, పంపు హౌస్ లను పరిశీలించారు. స్థానిక సాంకేతిక నిపుణులతో మరమ్మత్తులపై చర్చించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి హిందూపురం పట్టణానికి నీరు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం నుండి మెకానిక్ లను పిలిపించి మాట్లాడారు, వేసవికాలంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తక్షణ మరమ్మత్తులు చేయించాలని, అందుకు అవసరమైన సామాగ్రి, ఇతరత్రా వాటిని వెంటనే సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ, హిందూపురానికి గొల్లపల్లి రిజర్వాయర్ నుండి రోజు 10 ఎం ఎల్ డి.నీరు సరఫరా అవుతుందని, అయితే ఒకసారి విద్యుత్ అంతరాయం, చిన్నపాటి రిపేర్లు వల్ల ఒకరోజు 8 నుండి 9 ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరుగుతోందన్నారు. అలాంటప్పుడు పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో నీరు అందించలేమని, ఈ విషయాన్ని శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాలతో అందుకోసం ప్రత్యేకంగా సరఫరా సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రణాళికల సిద్ధం చేస్తున్నామన్నారు. మరో 15 రోజుల్లో అన్ని పరిస్థితులు సర్దుకుంటాయని, నీటి సరఫరా సామర్థ్యం 10 నుండి 16 ఎం.ఎల్.డి. అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ మోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, ఆయూబ్, దుర్గా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నలుగురు అరెస్ట్

**-కొడవలి,ద్విచక్ర వాహనం స్వాధీనం**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలుగూరు వద్ద జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హిందూపురం డిఎస్పీ వీకే మహేష్ తెలిపారు. నిందితులు షేక్ మహమ్మద్ షఫీ, అరెస్టు షేక్ తౌఫిక్, రేష్మా, సలీమా అలియాస్ సల్మా లను అరెస్టు చేయడంతో పాటు వారి నుండి ఓ కొడవలి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వివరించారు. షేక్ మహమ్మద్ షఫీ భార్య రేష్మాతో హతుడు సద్దాంబేగ్ కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఈ నెల 17వ తేదీన సద్దాం బేగ్ పనిచేసే ఫ్యాక్టరీ వద్ద గొడవ జరిగింది. ఈ గొడవలో మహమ్మద్ షఫీ కు రక్త గాయాలయ్యాయి. దీనిపై స్థానిక వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన నిందితులు ద్విచక్ర వాహనంలో హిందూపురం చేరుకున్నారు. ఘర్షణ విషయం కారణంగా మర్యాద పోయిందని భావించిన ఆ నలుగురు, ఎలాగైనా సద్దాంబేగ్ ను హతమార్చాలని పథకం రూపొందించారు. ఇందులో భాగంగా సద్దాంబేగ్ కోసం వెతుకుతుండగా ఈనెల 18వ తేదీ రాత్రి ప్రభుత్వా సుపత్రిలో ఉండగా బలవంతంగా ద్విచక్ర వాహనంలో మలుగూరు-రంగపురం రహదారి నడుమ మలుగూరు చెరువు వద్ద ముందుగా తెచ్చుకున్న కొడవలితో సద్దాంబేగ్ ను విచక్షణారహితంగా నరికి చంపారు. అప్పట్లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా సిఐలు జనార్దన్, ఆంజనేయులు, అబ్దుల్ కరీం, ఎస్సై శ్రీధర్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 20వ తేదీన నిందితులను వన్టౌన్ ఇన్చార్ సీఐ జనార్ధన్ నేతృత్వంలో అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి వివరించారు. హత్య చేసిన నిందితులను త్వరితగతిన అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐలు, ఎస్సై తదితర సిబ్బందిని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న అభినందించారు.

## పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి: అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.**

ప్రజాభూమి, అనంతపురము



పదో తరగతి పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి. అధికారులను ఆదేశించారు. శుక్రవారం మారుతీ నగర్ మూడవ క్రాస్ లో ఉన్న గుడ్ చిల్డ్రన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏ, బి పదో తరగతి పరీక్ష సెంటర్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేసిన బల్లలు (డెస్కులు) చాలా చిన్నవిగా ఉన్నాయని, వాటిని మార్చాలని, అలాగే వెలుతురు సరిగా లేని రూములలో లైట్లు వేయాలని, పరీక్షలు నిర్వహించే ముందు విద్యాశాఖ అధికారులు ప్రతి పరీక్ష కేంద్రాలలోని వసతులను పరిశీలించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని, ఎక్కడైనా అలసత్వం వహిస్తే వారిపై వెంటనే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 135 పరీక్ష కేంద్రాలలో శుక్రవారంజరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 31,009 గాను 30,213 మంది హాజరయ్యారని, 796 మంది గైర్హాజర్ కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ 30 మంది విద్యార్థులకుగాను 16 మంది విద్యార్థులు హాజరు అయ్యారని, 14 మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 810 మంది గైర్హాజర్ కావడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు గాను 135 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 30 సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులను, 07 ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులను, 1,410 ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈరోజు జిల్లా కలెక్టర్ 1 కేంద్రాన్ని, జిల్లాస్థాయి పరిశీలకులు 6 కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 1 కేంద్రాన్ని, అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ 1 కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్ 37 కేంద్రాలను, మొత్తం 46 పరీక్షా కేంద్రాలను సందర్శన, తనిఖీలు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి వసతితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులు ఒత్తిడిలకు లోనుకాకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. జిల్లాలోని 135 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ ప్రసాద్ బాబు, అనంతపురం రూరల్ తహసీల్దార్ హరిప్రసాద్, పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి పై సచివాలయ సిబ్బంది ఎంపీడీవోకు ఫిర్యాదు

### సచివాలయ సిబ్బందికి న్యాయం చేస్తా ఎంపీడీవో.

ప్రజా భూమి,లేపాక్షి



మండల పరిధిలోని చోళ సముద్రం పంచాయతీ కార్యదర్శి తమను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సచివాలయ సిబ్బంది ఎంపీడీవో నరసింహమూర్తికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రతి చిన్న విషయానికి సిబ్బందికి మెమోలు ఇస్తున్నారన్నారు. చివరకు పంచాయతీ కార్యదర్శుల లాగిన్ కూడా సిబ్బంది చేయాలని బలవంత పెడుతున్నారన్నారు. సిబ్బంది ఏదైనా మాట్లాడితే పై అధికారికే ఎదురు చెబుతావా అని మందలిస్తున్నారన్నారు. డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్త సేకరణ పనులు కూడా సచివాలయ సిబ్బంది చూసుకోవాలని మాపై అజమాయిషి చలా ఇస్తున్నారన్నారు. తాను సమయానికి రాకపోగా సచివాలయ సిబ్బంది మాత్రం సమయానికి రావాలని, సచివాలయ సిబ్బందిని సేవకులనట్టుగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ సర్వేలు వంటి కార్యక్రమాల్లో సెక్రెటరీ భాగస్వామి కాకపోగా ఏదో చిన్న పొరపాటును పట్టుకుని సిబ్బందిని మనో వ్యధకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గ్రామాల పర్యటనలో ఉన్నప్పుడు సెల్ ఫోన్ ద్వారా మెసేజ్ పంపి అప్పటి కప్పుడు రావాలని కార్యదర్శి తమను ఆజ్ఞా పిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది రోజు హాజరుతోపాటు కదిలి కల రిజిస్టర్ కూడా రాస్తున్నామన్నారు. తమ జీతం బిల్లును పెట్టే సమయంలో డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఎంపీడీవో ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శి పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## నేడు "ప్రపంచ జల దినోత్సవం" నిర్వహించాలి

**- ప్రతి గ్రామ పంచాయతీలోనూ 3 నుంచి 5 ఫారంపాండ్స్ పనులను గ్రౌండింగ్ చేయాలి**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.**

ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

ఈనెల 22న (శనివారం) జిల్లాలో ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి. సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె.పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. అనంతపురంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో తాను పాల్గొంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం కింద ప్రతి గ్రామ పంచాయతీలోనూ 3 నుంచి 5 ఫారంపాండ్స్ పనులకు గ్రౌండింగ్ జరగాలన్నారు. జిల్లాలో 9,000 లక్ష్యం కాగా, ఇప్పటిదాకా 6,864 ఫారంపాండ్స్ మంజూరయ్యాయన్నారు. వీటిలో ప్రతి పంచాయతీలోనూ 3 నుంచి 5 ఫారంపాండ్స్ గ్రౌండ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మెటీరియల్ ఖర్చుకు సంబంధించి రూ. 186.41 కోట్ల లక్ష్యానికి గాను, రూ. 194.55 కోట్లు ఖర్చు జరగగా, 104 శాతం ఇప్పటివరకు ఉపయోగించుకోవడం జరిగిందని, కేటాయించిన లక్ష్యానికిపైగా చేరుకోవడం జరిగిందన్నారు. పశువుల షెడ్లు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా నెలాఖరులోపు పూర్తి చేయాలని డ్వామా పిడిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి సలీం బాషా, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

